క్లుప్తంగా

17న రాజ్యలక్ష్మి అమ్మవారి జలకం



అంబాజీపేట: తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి జలకాన్ని వచ్చే నెల 17న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 13న అమ్మవారి తీర్థం జరుగుతుందన్నారు. గ్రామంలోని ఆయా సామాజిక వర్గాల వారు అమ్మవారి పూజ ఘటాలను గ్రామోత్సవం నిర్వహించి పూజలు చేస్తారన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



భక్తులకు మొక్కలు అందజేస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. అటవీశాఖ సమకూర్చిన పలు రకాల మొక్కలను చైర్మన్ రామకృష్ణ ఆదివారం అప్పనపల్లి ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకుంటామంటూ భక్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఎం.రామిరెడ్డి, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాటసారులకు డ్రింక్‌ల పంపిణీ



అంబాజీపేటలో డ్రింక్‌లు పంపిణీ చేస్తున్న యువకులు

అంబాజీపేట: అధిక ఉష్ణోగ్రతలు... వేడి గాలులకు ప్రయాణించే పాదచారులకు, వాహనదారులకు హైదరాబాద్ వినాయక యాడ్స్ అధినేత బొక్కా వినాయకరావు ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఆదివారం కూల్ డ్రింక్‌లను పంపిణీ చేశారు. వినాయకరావు సమకూర్చిన నిధులతో గత మూడు రోజులు నుంచి స్థానిక యువకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వేసవి దప్పికను తీరుస్తున్నారు. ఎండలు తగ్గేంత వరకు ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామని యువత తెలిపారు. పుల్లేటికుర్రులో రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యుడు ఒరిగిట బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ కేఎస్ నారాయణ, సర్పంచ్ జల్లి బాలరాజు ప్రారంభించారు. ఈ చలి వేంద్రాన్ని నెలాఖరు వరకూ కొనసాగిస్తామని రెడ్ క్రాస్ లైఫ్ టైమ్ సభ్యుడు బీర సందీప్ తెలిపారు.

అనారోగ్య బాధితులకు చేయూత



ఊబలంకలో సీతామహాలక్ష్మికి సాయం అందిస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్‌తో ఒకరూ, నిమోనియాతో మరొకరు అనారోగ్యం పాలై బాధపడుతున్న వారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన రాజోలు సీతామహాలక్ష్మి గత మూడేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుంది. పేదరికంతో వైద్యఖర్చులకు నానా ఇబ్బంది పడుతుంది. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆమెకు రూ.10 వేలు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేశారు. అలాగే ఏలూరు పట్టణానికి చెందిన సాయి శ్రీశ్రద్ధ అనే పాప గత మూడు నెలలుగా నిమోనియాతో బాధపడుతుంది. తల్లిదండ్రులు విజయవాడలో ఆంధ్రా హాస్పిటల్‌లో వైద్యం చేయిస్తున్నారు. పేదరికంతో వారు వైద్యఖర్చుల నిమిత్తం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. దీంతో సేవా సమితి సభ్యులు కొందరు విజయవాడ వెళ్లి అక్కడ ఆంధ్రా ఆస్పత్రి వద్ద ఆ పాప తల్లిదండ్రులకు రూ.15 వేల వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేసినట్టు సేవాసమితి సభ్యులు తెలిపారు.

కార్టూన్ పోటీల్లో రాముకు బహుమతి

అమలాపురం రూరల్: హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల్లో అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము బహుమతి అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో చిత్రకారుడు రాముకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ బహుమతి అందజేశారు.

పేదవాడి పంకా విసనకర్ర

- చల్లని గాలినిచ్చే సాధనం కనుమరుగు
- డిజిటల్ యుగంలో ఆదరణ అంతంతే..



మడికిలో విసనకర్రలను విక్రయిస్తున్న దృశ్యం

ఆలమూరు: దశాబ్దాలుగా విసనకర్ర పేదవాడి గాలి పంకాగా సేవలందిస్తుంది. అత్యంత చౌకగా లభించే ఈ విసనకర్ర చల్లని గాలినిచ్చే సాధనంగా పేరుంది. నేటి డిజిటల్ యుగంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, అత్యాధునిక వసతులు అందుబాటులోకి రావడంతో విసనకర్ర ఉపయోగం సంచార, కార్మిక వర్గాలకే పరిమితమైంది. దీంతో విసనకర్రలకు అంతంత మాత్రంగానే ఆదరణ లభిస్తుంది. గతంలో ఇన్వర్టర్ల సదుపాయం లేకపోవడంతో పల్లె ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ తాటాకు, ఈత ఈనెలు, అరటి దొప్ప నారతో తయారు చేసే విసనకర్రలను విరివిగా ఉపయోగించుకుని చల్లని గాలితో సేద తీరేవారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ఎయిర్ కండీషన్లు, సీలింగ్, బ్యాటరీ ఫ్యాన్లు, భారీ ఇన్వర్టర్లు, జనరేటర్లు అందుబాటులోకి రావడంతో పాటు విద్యుత్ కోతలు లేకపోవడం వల్ల నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుంది. దీంతో ఎల్లప్పుడు విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో విసనకర్రల అవసరం లేకుండా పోయింది. అప్పట్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్యం తక్కువగా ఉండటంతో వృద్ధులు ఆరుబయటే మంచాలు వేసుకుని చల్లని గాలి కోసం విసనకర్రలను పక్కన పెట్టుకుని నిద్రించేవారు. ఇటీవల కాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండటం, కాంక్రీటు భవనాల వల్ల చెట్లు లేక గాలి వేయకపోవడం తదితర కారణాల వల్ల ఆరు బయట నిద్రించే అలవాటు బాగా తగ్గిపోయింది. దీంతో నేటి తరానికి విసనకర్ర అంటేనే నేటి తరానికి తెలియని పరిస్థితి నెలకొంది. ఉగాది, శ్రీరామనవమి పర్వదినాల రోజున కొన్ని దేవాలయాల వద్ద ఈ విసనకర్రలను పంపిణీ చేయడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తుంది.

హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తున్నాం

పూర్వం నుంచి మా కుటుంబం వేసవిలో విసనకర్రలు తయారు చేస్తుంది. గత కొన్నేళ్ల నుంచి విసనకర్రలకు గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ లభించక హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయించి పెట్టుబడి రాబట్టుకుంటున్నాం.

– కె.సత్యనారాయణ, విసనకర్రల వ్యాపారి, కొత్తపల్లి

విసనకర్రలతో సేద తీరుతున్నాం

ఉపాధి కోసం వచ్చి రోజుల తరబడి ఇక్కడే జీవిస్తున్నాం. వేసవి ప్రభావాన్ని తట్టుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన వస్తువులతో తయారు చేసిన విసనకర్రలను ఉపయోగించుకుని సేద తీరుతున్నాం.

– రాజు, సంచార భవన నిర్మాణ కార్మికుడు, శ్రీకాకుళం

గ్రంథాయాలు విజ్ఞాన గనులు

అంబాజీపేట: పుస్తక పఠనం ద్వారా ప్రతి ఒక్కరూ పరిపూర్ణ మనిషిగా మారవచ్చని అందుకోసం చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై శ్రద్ధ కనబర్చాలని రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం విద్యార్థులు పాల్గొన్నారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విజ్ఞానం పెంచే గ్రంథాలయాల్లో ఉచితంగా ఇచ్చే శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, సంగీతం, ఆంగ్లభాష తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ రీడర్స్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

పి.గన్నవరం: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని చాకలిపాలెం సెంటర్ నుంచి వాడ్రేవుపల్లి వై-జంక్షన్ వరకూ జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని దేవరపల్లి గ్రామం కొత్తపాలేనికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలైన వాసంశెట్టి సూర్యనారాయణ, శీలం శ్రీనివాస్, బొక్కా నాగేశ్వరరావు, శీలం నారాయణ, శీలం చంద్రరావు, శీలం వెంకటేశ్వరరావు, వనుము శ్రీనివాస్, బొక్కా శ్రీరాములు, సోడే రామకృష్ణ, బొక్కా శ్రీనివాస్, బొక్కా రాంబాబు, మట్టపర్తి శ్రీను, కుడుపూడి పవన్ తదితరులు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బొక్కా ప్రసాద్, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గుబ్బల లోవకృష్ణ, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, ఎంపీటీసీ కుడుపూడి నాగరాజు, పితాని రాంబాబు, పితాని రమణ, మల్లేశ్వరపు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పినాక రాంప్రసాద్‌రెడ్డి రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. ఈఓ మాట్లాడుతూ పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో 45 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఉదయం 8.48 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులంతా విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించినట్లు తెలిపారు.

వలంటీర్ల పాత్ర చాలా కీలకం



పాశర్లపూడిలో వలంటీర్ల సన్మాన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో వలంటీర్ల పాత్ర చాలా కీలకమైందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడి గ్రామ పరిధిలోని వలంటీర్లను ఆదివారం ఘనంగా సత్కరించారు. వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లపై ఎంతో నమ్మకంతో ముందుకు వెళ్తోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలోను వలంటీర్లు అందిస్తున్న సహకారం మరువరానిదని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా

ఎమ్మెల్యే చిట్టిబాబు



అప్పనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం అప్పనపల్లిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించారు. అర్హులకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి. పథకాల అమల్లో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా! అన్న అంశాలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలన్నదే గడప గడపకూ మన ప్రభుత్వం ఉద్దేశమని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల జనార్దన్, పార్టీ నేతలు గెడ్డం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, నల్లా యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెం ధర్మసత్రం పాలక మండలి ప్రమాణ స్వీకారం



వాడపాలెంలో నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: పూర్వం ఎంతో సహృదయంతో ధర్మసత్రం ఏర్పాటు చేసిన దాతల ఆశయం మేరకు నూతన పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. మండలంలోని వాడపాలెం బండారు పేరమ్మగారి స్వామిగారి అన్నదాన సమాజం (ధర్మసత్రం) నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మసత్రం వద్ద జరిగిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ధర్మసత్రం పాలకమండలిని అభినందించారు. పాలకమండలి చైర్మన్ బండారు సత్య ఉమేష్, ధర్మకర్తలు గంగుమళ్ల జనార్దనరావు, వీధి సత్యవతి, పెట్టా వీరవెంకటసత్యనారాయణ, మిండగుదిటి లక్ష్మీసరస్వతి, కింతాడ నాగేశ్వరరావు, తణుకు కళావతిలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఉమేష్, స్థానిక నాయకులు జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. నూతన పాలకమండలిని జగ్గిరెడ్డి సత్కరించారు. ముందుగా జగ్గిరెడ్డికి స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, రావులపాలెం జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ నా యకులు కర్రి నాగిరెడ్డి, చల్లా ప్రభాకరరావు, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, బండారు లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదలకు సేవలు అభినందనీయం



అవార్డు గ్రహీత భాస్కరరావు సన్మానించిన పాటి శివకుమార్

మలికిపురం: సమాజంలో పేదలకు విశేష సేవలు అందిస్తున్న గల్ఫ్ శెట్టిబలిజ యువ శక్తి సేవా సంస్థ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శి పాటి శివకుమార్ పేర్కొన్నారు. సంస్థ నిర్వహిస్తున్న సేవలకు గాను ఇటీవల అహ్మద్ ఆర్ట్స్ సంస్థ నుంచి గ్లోబల్ 2023 అవార్డు అందుకున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా భాస్కరరావును ఆదివారం ఆయన గుడిమెళ్లంకలో సన్మానించారు. కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ ఈ రోజుల్లో స్వచ్ఛంద సేవా సంస్థల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నేటి యువతలో సేవాభావం పెరిగిందన్నారు. ఇది సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. యువత గ్రూపులుగా ఏర్పడి చిన్న మొత్తాలను సమకూర్చి ఆపదలో ఉన్న వారికి ఆసరాగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ ఆపరేషన్‌కు 'మానవతా' సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మానవతా గ్రూపు సభ్యులు

మలికిపురం: లక్కవరంలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి చెందిన మహిళ ఆపరేషన్‌కు మానవతా గ్రూపు సభ్యులు, దాతలు ముందుకు వచ్చారు. భట్నవిల్లి గ్రామానికి చెందిన కరాటం వీరవేణి కుటుంబం లక్కవరంలో స్థిరపడ్డారు. ఆమెకి అత్యవసరంగా గర్భసంచి ఆపరేషన్ చేయాల్సి రావడంతో దాతలు రూ.20 వేలు సమకూర్చారు. లక్కవరం గ్రామానికి చెందిన ముదునూరి ప్రసాదరాజు రూ.10 వేలు, గేదెల శివశంకర్ రూ.3 వేలు మరో ఐదుగురు దాతలు సహకారంతో రూ.20 వేలు సమకూర్చారు. ఆదివారం లక్కవరం సత్య ఆసుపత్రి వైద్యులు కొప్పినీడి శ్రీహరితో మానవతా గ్రూపు సభ్యులు సంప్రదించి తక్కువ ఖర్చుతో ఆపరేషన్ చేసేందుకు మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బోనం సాయిరాం, బోనం రాజు, యేపుగంటి రాంబాబు, దొడ్డా వెంకటపతి, బోనం కాశి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో నేడు గడప గడపకూ..

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నాలుగో విడత నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపు నిచ్చారు.

నేడు వేణుగోపాలస్వామి ఆలయ శంకుస్థాపన

ఆత్రేయపురం: మండలంలోని పులిదిండిలో వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో ఆలయ అధికారులు, గ్రామస్తుల సహకారంతో శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. శంకుస్థాపనలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి–లావణ్య దంపతులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి భక్తులంతా హాజరు కావాలని కోరారు.

అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలి

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు నుంచి మానేపల్లి శివారులోని లంకభూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ నాయకులు, స్థానికులు ఆందోళన నిర్వహించారు. అనుమతులు ముగిసినా ఇసుక తీస్తున్నారని వారు ఆరోపించారు. ఇసుక తవ్వకాలను నిలిపి వేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, స్థానికులు యల్లమెల్లి చిట్టిబాబు, పుచ్చకాయల చంటి, సత్యనారాయణ, పోతుల వెంకటరమణ, పుల్లెల్ల ఆనంద్ తదితరులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలకు తమకు అనుమతులు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు లారీలను అడ్డగించి ఆటంకం కల్పిస్తున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

భానుడి భగభగలు



అధిక ఉష్ణోగ్రతలతో నిర్మానుష్యంగా మారిన పుల్లేటికుర్రు ప్రధాన రహదారి

అంబాజీపేట: ఇంట్లో ఉంటే ఉక్కబోత.. బయటికొస్తే ఎండ వేడిమి.. బజారుకు వెళ్తే నిలువ నీడ లేని పరిస్థితి.. ఇది ఈ వేసవిలో కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న వర్ణనాతీత ఇబ్బందులు. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఇళ్ల నుంచి కాలు బయట పెట్టాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. శనివారం రాత్రి ఉరుములతో కూడిన చిరు జల్లులు పడి కాస్త ఊరట ఇచ్చినప్పటికీ, ఆదివారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. శుక్ర, శని, ఆదివారాల్లో 39, 39.5, 40.3 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న ప్రజలు ఎండ నుంచి రక్షణ పొందేందుకు ముఖానికి మాస్కులు వేసుకుంటున్నారు. ఎండలకు తోడు వడగాడ్పులు వీస్తుండటంతో దప్పికకు గురవుతున్నారు. వేసవితాపానికి ప్రయాణికులు శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు చల్లని పానీయాలను సేవించి సేదతీరుతున్నారు. ఎండ నుంచి రక్షించుకునేందుకు టోపీలు, మాస్కులు ధరిస్తున్నారు. భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు జనం మొగ్గు చూపుతున్నారు. పళ్లరసాలు, జ్యూస్ సెంటర్ల దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

మామిడికుదురు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని కాంగ్రెస్ నేతలు ప్రస్తుతించారు. రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలోని విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: యువత మరింత అభివృద్ధి చెందాలంటే రాజీవ్‌గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యులు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ అన్నారు. పి.గన్నవరంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. రాజీవ్ విగ్రహానికి వారు నివాళులు అర్పించారు.

పట్టు తప్పితే.. అంతే సంగతి



అంబాజీపేటలో ట్రాక్టర్‌పై నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న కూలీలు

అంబాజీపేట: వాహనాలపై వెళ్లే సమయంలో నిర్లక్ష్యం కారణంగా నిత్యం ఏదో ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్న విషయాలు తెలుసుకుంటున్నారు. వింటున్నారు. అయినప్పటికి కొంత మందికి ఇవేమి పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తుంది. ఎండి కొబ్బరాకుల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ సీటుకు ఇరువైపులా ఆరుగురు కూర్చుని దర్జాగా ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్నారు. అదుపు తప్పి ఏదైనా ప్రమాదం జరిగితే వారినే నమ్ముకున్న కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటి అనే ఆలోచన రాకపోవడం విచారకరమని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలను చూసీచూడనట్లుగా ఆర్టీవో అధికారులు వదిలేస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.